విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 10, అక్టోబరు 2025

ఎన్టీఆర్ వైద్య సేవను నిర్వీర్యం చేయకండి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవలను నిర్వీర్యం చేయాలని చూడడం విచారకరమని, ప్రైవేట్ ఆసుపత్రులకున్న బకాయిలను వెంటనే చెల్లించి పునః ప్రారంభించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాముడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు నుండి 2,700 కోట్లు బకాయిలున్నాయని, అందువల్ల అసోసియేషన్ ప్రతినిధులు అక్టోబర్ 10వ తేదీ నుండి వైద్య సేవలు అమలు చేయమని ప్రభుత్వానికి అల్టీమేటం ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు అనేక ఉచిత పథకాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని, వైద్య సేవ బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేసి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకోవడం తగదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ స్పెషాలిటీ ఆసుపత్రులకున్న బకాయిలను

చెల్లించి ఎన్టీఆర్ వైద్య సేవలను పున ప్రారంభించాలని లేని పక్షంలో సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

కన్నీటి ఉల్లి

విశాలాంధ్ర - చాగలమర్రి : ఉల్లి పంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. మూడు నెలల పాటు ఉల్లి పంటను పండిస్తే ధరలేక రైతన్నలు కుప్పకూలిపోయే పరిస్థితి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలిలో నరసమ్మ అనే మహిళా రైతు రెండెకరాల్లో ఉల్లిని సాగు చేసింది. ధర లేకపోవడంతో గురువారం పొలంలోనే కుప్పలుగా పోసిన ఉల్లి గడ్డలను వదిలేశింది. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని వారి వారి గృహాలకు తీసుకెళ్లారు. కేజీ ధర రూ.2 పలకడంతో ఉల్లిగడ్డలు కోసిన కూలీలు రూ.15వేలు అవుతుండటంతో పంటను వదిలేశానని రైతు ఆవేదన వెలిబుచ్చింది . రెండెకరాల్లో పెట్టుబడి రూ.లక్ష దాక ఖర్చు చేశానని, తీరా పంట చేతికొచ్చాక ధర లేక నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు పరిహారం అందించి ఆదుకోవాలని మహిళా రైతు కోరింది.

ఉల్లిని తీసుకెలుతున్న ప్రజలు...

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ : ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణ 4వవార్డు నందు టీడీపీ ఇంచార్జ్ షేక్ మజీద్ ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వం లాగా ఎవరి ఫోటో వేయకుండా కేవలం ఆంధ్రప్రదేశ్ అధికారిక ముద్రణ మాత్రమే వేసి స్మార్ట్ కార్డును పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ స్మార్ట్ కార్డ్ వల్ల రేషన్ సమాచారం మన మొబైల్‌లోనే చూసుకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ రంగప్రసాద్, డైరెక్టర్ నూర్ బాషా, సుబ్బ లక్ష్మయ్య, పబ్బతి వేణు, పల్లె వెంకట సుబ్బయ్య, బింగుమల్ల శ్యాంసుందర్ గుప్తా, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్ బాషా, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మీ, వరప్రసాద రావు, సచివాలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాలల హక్కులకై ఉద్యమించాలి

విశాలాంధ్ర- నంద్యాల రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా మాలలు ఎదుర్కొం టున్న సమస్యలపై ఉద్యమించాలని నీసు దస్తగిరి, బండి దేవాంత కుడులు అన్నారు. గురువారం స్థానిక మాల మహానాడు కార్యాలయం నందు నంద్యాల జిల్లా ముఖ్యుల సమావేశం పాలాజీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నీసు దస్తగిరి, దేవాంతకుడులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుండి ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న మాలల సమస్యలు పరిష్కరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మాలలు ఆర్థికంగానూ రాజకీయం గాను వెనుకబడి ఉన్నారని తెలిపారు. అందువల్ల మాలల హక్కులకై ఉద్యమించే సమయం ఆసన్నమైందని వారు పేర్కొన్నారు. కావున ఈనెల 11వ తేదీన మాలల హక్కుల కోసం జిల్లా కేంద్రం నందు పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. దీంతోపాటు అదే రోజు జిల్లా నూతన కమిటీ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మెట్టుపల్లి వెంకట కృష్ణయ్య, ఓబయ్య, ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చింతలచెరురు గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేసి పదవి విరమణ అయిన శ్రీనివాసులు విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణగా అందజేసారు. పాఠశాల విద్యార్థుల క్రీడాభివృద్ధి కొరకు పదివేల రూపాయల విలువచేసే క్రీడా దుస్తులను గురువారం ప్రధానోపాధ్యాయులు జె.వి సుబ్బరాయుడు చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి, రాష్ట్ర స్థాయికి మరియు జాతీయస్థా యికి ఎంపిక అవ్వాలని విద్యార్థులను కోరారు. అనంతరం క్రీడా దుస్తులను వితరణ చేసిన దాతను హెచ్ఎం సుబ్బరాయుడు,పిడి దాదాపీర్,ఉపాధ్యాయులు ఏవి సుబ్రమాణ్యం, సుబ్బలక్షుమ్మ, నాగేశ్వర రెడ్డి,విద్యార్థి బృందం ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన లాయర్‌ను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం నాడు పట్టణంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత కులానికి చెందిన గవాయి సుప్రీంకోర్టులో తన విధుల్లో ఉన్నప్పుడు కోర్టులో రాజేష్ కిషోర్ అనే సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం యావత్ భారత దేశా నికి సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాదిగ పెద్ద మునయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మాదిగ ఏరన్న, వెంకటరాముడు, పసుపల నాగన్న మాదిగ, ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే ఎస్సీలకు సముచిత స్థానం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వైసీపీతోనే ఎస్సీ సామజిక వర్గానికి సముచిత స్థానమని ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు అన్నారు. జిల్లా ఎస్సి సెల్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్సీపీ పరిశీలకురాలు, ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు వైసీపీ ఇంచార్జి డాక్టర్ దార సుధీర్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, డా.సుధీర్ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ బాబు, ఉపాధ్యక్షుడు కనకరాజు, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ మరోసారి జగన్ మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకొనేందుకు ప్రతి ఒక్క ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు సైనికుల్లా పనిచేసి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనక లావణ్య, నంద్యాల, నందికొట్కూరు, బనగానపల్లె, శ్రీశైలం, డోన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఘనంగా అటవీ శాఖ క్రీడలు ప్రారంభం

విశాలాంధ్ర-పాణ్యం : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ ఫారెస్ట్ సర్కిల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఫారెస్ట్ డైరెక్టర్స్ ప్రొటెక్ట్ టైగర్ నంద్యాల సర్కిల్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు క్రీడల కన్వీనర్ నంద్యాల ఎఫ్ఆర్ఓ నాసిర్జ తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడలను టైగర్ ప్రాజెక్టు సర్కిల్ కన్జర్వేటివ్ విజయ్ కుమార్ ప్రారంభించారు. కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్ క్యారమ్స్, షటిల్, డిస్కస్ త్రో, షాట్ పుట్ తదితర క్రీడల్లో అడవి సిబ్బంది పాల్గొన్నారు. ఈ క్రీడల్లో మార్కాపురం, నంద్యాల, ఆత్మకూరు, గిద్దలూరు డివిజన్లకు చెందిన 150 మంది అటవీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్సర్వేటర్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో విజేతలు జాతీయ స్థాయిలో నవంబర్ 14న డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. భావితరాలకు మంచి ఆరోగ్యం వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగికి ఉండాల్సిన అవసరం ఉండ డంతో శారీరకంగా మానసికంగా ఫిట్నెస్ కలిగి ఉండాలని లక్ష్యంతో ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావు, గిద్దలూరు డిడి మేడం నిషాకుమారి నంద్యాల డిడి అను రాగ్ మీనా, మార్కాపూర్ డిడి ఎండి అబ్దుల్ రావు షేక్, గిద్దలూరు డిఎఫ్ఓ బాలరా జు, శ్రీశైలం డీఎఫ్ఓ భవిత కుమారి, రుద్రవరం డిఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, నాసిర్జా ఉదయ దీప్, మూర్తిజావలి, శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ నాగేంద్ర, పీడీలు చంద్రారెడ్డి వెంకటేష్ నాయక్, సుబ్రహ్మణ్యం, ముని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో బంగారు ఆభరణాల ఎగ్జిబిషన్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం సౌజన్య ఫంక్షన్ హాల్ లో అన్సర్ జువెలర్స్, కిస్న డైమండ్ వారి సంయుక్త బంగారు ఆభరణాల ఎగ్జిబిషన్, సేల్స్ ను ఈ నెల 11, 12, 13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అన్సర్, అమీర్ లు తెలిపారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలతో మీ ముందుకు వస్తుంది కిస్నా డైమండ్ ఎగ్జిబిషన్ అని, శనివారం రాష్ట్ర మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. డైమండ్ ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి లక్కీ డిప్ ఉందని, లక్కీ డిప్‌లో గెలుపొందినవారికి కార్లు, స్కూటర్లు బహుమతులు ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్సర్ జ్యూవెలర్స్ యజమానులు అన్సర్, అమీర్ లు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రఖ్యాత కిస్నా డైమండ్ వారితో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని, ఫస్ట్ క్వాలిటీ డైమండ్ తో వజ్ర ఆభరణాలు ఉంటాయాని, ఒక క్యారెట్ విలువ 48 వేల రూపాయల నుండి ప్రారంభ ధర ఉంటుందని, ఈ అవకాశాన్ని నంద్యాల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జీవితం కోసం సూపర్ ఆదా

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రజల ఆరోగ్యానికి పెద్ద ఊరట, ఆరోగ్యం, జీవితం కోసం సూపర్ ఆదా అని వైద్య శాఖ హెల్త్ఎడ్యుకేటర్ విజయభారతి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిఎస్‌టి 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ ప్రజల ఆరోగ్యా నికి పెద్ద ఊరట, ఆరోగ్యం, జీవితం కోసం సూపర్ ఆదా అని పేర్కొన్నారు. మందుల ధరలు తగ్గించడం, ఆరోగ్య సేవలు చవకగా చేయడం, ప్రతి కుటుంబం భీమా సౌకర్యం పొందేలా చేయడం, ఈ జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ప్రాణ రక్షక మందుల ధరలు తగ్గుతాయన్నారు. ఆరోగ్య, జీవిత బీమా తీసుకోవడం సులభం అవుతుంది అని తెలిపారు.వైద్య పరికరాలు పైన 12శాతం నుండి 5శాతం వరకు తగ్గింపు, 36 ప్రాణ రక్షక మందులపై పూర్తిగా జీఎస్టీ రద్దు, బీమాపై పన్ను పూర్తిగా రద్దు, జీవిత ఆరోగ్య బీమాపై జీఎస్టీ పూర్తిగా రద్దు అంటే ప్రతి పాలసీపై నేరుగా 18శాతం ఆదా అవుతుందన్నారు. దీని వలన ఆరోగ్య రంగంలో పన్ను విధానం సులభతరం అవుతుందన్నారు. హెల్త్‌సూపర్ వైజర్ రామలింగారెడ్డి, హెల్త్అసిస్టెంట్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌలభ్యం కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని టీడీపీ నాయకులు నాగిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మహేష్ రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని లింగాపురం గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారుల

కు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని వారు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డుల విషయంలో అనేక సమస్యలు ఎదురైనా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు అందజేస్తూ పారదర్శకంగా అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి చాణిక్య, వీఆర్ఏ శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యం

విశాలాంధ్ర-పాణ్యం : పీఎం శ్రీ ద్వారా విద్యార్థులకు జ్ఞానాన్ని పంచుకోవడం, మార్గదర్శకం ద్వారా విద్య నైపుణ్యాన్ని ప్రోత్సహించడం సమాజ పురోగతికి అర్థవంతంగా దోహదపడాలనే శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల దార్శనికతను బలోపేతం చేస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని నెరవాడ సమీపంలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల పీఎం శ్రీ (ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) చొరవ కింద కర్నూలు జిల్లాలోని ఆరు పాఠశాలలకు మెంటర్ ఇన్స్టిట్యూట్‌గా గుర్తింపు పొందడం ద్వారా మరో మైలురాయిని సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు ఆవిష్కరణ, విద్యా నైపుణ్యం మరియు సమాజ అభివృద్ధిని పెంపొందించడంలో సంస్థ యొక్క నిరంతర నిబద్ధతను హైలైట్ చేస్తుంది. కళాశాల సంస్థ యొక్క ఇన్నోవేషన్ కౌన్సిల్ వారి స్థిరమైన ప్రయత్నాలు, కార్యకలాపాలను విజయవంతంగా సమర్పించడం ద్వారా ఈ విజయంలో ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు జడ్జి బిఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ చెప్పు విసరడం హేయమైన చర్య అని మాల మహానాడు రామోజీ ఇమ్మా నుయేల్ వర్గం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రమళ్ళ చక్రవర్తి, నంద్యాల జిల్లా ఇంచార్జి బి.చంద్రశేఖర్‌లు ఖండించారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి జేఏసి కన్వీనర్ బీరువాల బాష మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జడ్జి బిఆర్ గవాయ్ పై న్యాయవాది రాకేష్ కిషోర్ చెప్పు విసరడం దుర్మార్గం అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం గా ఉన్న మన భారత దేశంలో ఇటువంటి మతపరమైన అంశాలు లేవనేత్తడం సరికాదన్నారు. దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ అధ్యక్షులు బద్రి వెంకట నారాయణ, రుద్రవరం మండలం అధ్యక్షులు కేత బ్రహ్మం, ఆళ్లగడ్డ జకార్య, షేక్ నూర్ బాష, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు బలమైన ఆహారం ఇస్తున్నాం

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టణంలోని జమ్మి నగర్ తండా ఆరవ అంగన్వాడీ సెంటర్ నందు గురువారం సిడిపిఓ కోటేశ్వరి సూపర్వైజర్లు రమాదేవి,కోమల, విజయ హాజరయ్యి తల్లులు గర్భవతులు బాలింతలు, ఇతర కిశోర బాలికలుతో సమావేశం నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ రక్తహీనత గురించి పోషకాహారం గురించి గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరంగా వివరించారు. బాలామృతం గురించి ఆరు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ఇస్తే, వాటిలో ఉన్న పోషక విలువలను గురించి వివరించారు. వీటిలో భాగంగా అంగన్వాడీ టీచర్ జి.నాగలక్ష్మి తదితర టీచర్లు జమ్మి నగర్ తండాలోని ప్రజలు అందరూ పాల్గొన్నారు.

అహోబిలంలో పవిత్రోత్సవాలు..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం నిత్య పూజ అనంతరం యాగశా లలో ప్రధాన అర్చకులు వేణుగో పాల ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం హెూమం నిర్వ

హించారు. అహోబిలం మఠం 46వ పీఠాధి పతి ఆధ్వర్యంలో ఉత్సవమూ ర్తులైన ప్రహ్లాద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవా ర్లను పట్టు వస్త్రాలు పూలమా లతో పాటు పవిత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ ప్రహ్లాద వరద స్వామికి టీవీఎస్ అధినేత సుందర రాజన్ మకర తోరణం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా నల్లమల అరణ్యంలో వెలసిన నవ నరసింహ క్షేత్రాలను జీర్ణోదరణ చేసి మహా సంప్రోక్షణం కార్యక్రమం నిర్వహించడంలో టీవీఎస్ అధినేత ప్రముఖ పాత్ర ఉందన్నారు. 2024 జూలై మాసంలో దిగువ అహోబిల ఆలయం జీర్ణోద్ధరణ గావింపబడి మహా సంప్రోక్షణ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వైసీపీ నాయకుల వైఖరిపై నిరసన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల బొమ్మలసత్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు గురువారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అధ్యక్షతన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, జిల్లా ముఖ్య నాయకులందరూ కలిసి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, వైసీపీ పార్టీ చేస్తున్న నీచ రాజకీయాలను ఖండిస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల చిత్తూరు జిల్లా దేవళంపేట గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పు పెట్టిన ఘోర ఘటనను టీడీపీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనలపై, ఆయన సమానత్వ భావనపై వైసీపీ నేతలు చేస్తున్న చెత్త రాజకీయాలకు నిదర్శనమని ఫిరోజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

విలేకరులపై క్రిమినల్ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: సీఐ కంబగిరి రాముడుపై సిట్టింగ్ జడ్జి దర్యాప్తు జరపాలని ఆత్మకూరు జేఏసీ పాత్రికేయులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అతిథి గృహం నుంచి తహసిల్దార్ కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ రత్న రాధికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పోలీసులు జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటు అన్నారు. విలేకరులపై క్రిమినల్ కేసులు ఎత్తివేసి మీడియా స్వేచ్ఛను కాపాడాలన్నారు. పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి మండల స్థాయి స్కూల్ గేమ్స్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల యందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలు శుక్రవారం నుండి ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారులు అబ్దుల్ కలాం, రామ కృష్ణయ్యలు తెలిపారు. ఈ పోటీలలో కబడ్డీ కోకో వాలీబాల్ చేసి యోగ సెటిల్ బ్యాట్మెంటన్, అథ్లెటిక్ తదితర క్రీడలు ఉంటాయన్నారు. అండర్ 14,17 విభాగాలలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునారు. మండల ఎస్ జి ఎఫ్ కోఆర్డినేటర్ గా సుధారాణి ఉంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థిని విద్యార్థులలో ప్రతిభా నైపుణ్యం వెలికి తీసేందుకు క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదన్నారు.

అంగన్‌వాడీ సేవలు భేష్..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని కదిరిపురం తాండ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సేవలు భేష్ అని రాష్ట్ర మోడల్ ఫౌండేషన్ స్కూల్ అధికారిని కుసుమ అన్నారు. గురువారం కదిరిపు

రం తండాలో నిర్వహించబడుతున్న పూర్వ ప్రాథమిక విద్యా విధానంపై పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన పీపీ 1, పీపీ2 పుస్తకాలను పిల్లలకు టీచర్లు ఏ విధంగా వ్రాయిస్తున్నారో అడిగి తెలుసు కున్నారు. రాష్ట్ర కార్యాలయం నుండి పాఠశాలలను పర్యవేక్షించి సమా చారం సేకరించారు. మట్టి బొమ్మలను, వివిధ రకాల చిత్ర పటాలను అంగన్వాడి కేంద్రంలో అలంకరించడంతో అంగన్వాడి టీచర్ బాలకు లాయమ్మను, అంగన్వాడి సహాయకురాలు చంద్రమ్మను, అభినందిం చారు. పరిశీలనలో రాష్ట్ర మోడల్ ఫౌండేషన్ స్కూల్ సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి, ఎంఈఓ అనురాధ, సిఆర్పి అమీర్ ఖాన్‌లు ఉన్నారు.

చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఆల యం అభివృద్ధికి నంద్యా ల జిల్లా నందవరం గ్రామ వాస్తవ్యులు బిక్రీ దుల ఆదినారాయణ ధర్మపత్ని బిక్రీదుల సు బ్బమ్మ వారి కుమారుడు బిక్రీదుల బాలాజీ వారి కుటుంబ సభ్యులు రూ. 25వేలు చందాను డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో గురువారం ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

దేశ ప్రజలు రాహుల్ గాంధీని కోరుకుంటున్నారు

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ గణేష్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ దేశంలో 11 ఏళ్లుగా బీజేపీ పాలనలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందని, దేశ ప్రజలు జీఎస్టీ పన్నుల భారంతో విసిగిపోయారని విమర్శించారు. ప్రధాని మోదీ బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు జీఎస్టీ తగ్గించామని తాయిలాలు వేస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు నమ్మరని తెలిపారు. జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, బీజేపీ చేస్తున్న దొంగ ఓట్ల కుట్రలను బయటపెట్టారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే, ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి మద్దతుగా ఓట్ల దొంగ మోడీ గద్దె దిగు అను నినాదంతో సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. అనంతరం సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మార్కెట్ ప్రాంతంలో రాహుల్ గాంధీకి మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నంద్యాల డీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ మెంబర్ కర్నూలు జిల్లా ఇంచార్జీ జె.లక్ష్మీనరసింహ యాదవ్, మాజీమంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం.సుధాకర్ బాబు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఎం.నాగ మధు యాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షులు కె.బాబురావు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు, ఆయా విభాగాల జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ.. గో బ్యాక్



ఈ నెల 15న భారీ నిరసన, ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పి మాట తప్పిన మోడీకి కర్నూలులో పర్యటించే హక్కులేదని, 16న కర్నూలులో మోడీ పర్యటనను నిరసిస్తూ 15న మోడీ గోబ్యాక్ అంటూ నిరసన ర్యాలీ జయప్రదం చేయాలని వామ పక్షపార్టీల నేతలు పిలుపు నిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, నక్కి లెనిన్‌బాబు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, సీపీఎం నాయకులు రాధాకృష్ణ, రాముడు, రాజశేఖర్, నారాయణ, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, క్రిష్ణలతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.గిడ్డయ్య, గౌస్‌దేశాయ్, నాగన్నలు మాట్లాడుతూ 11 సం మోడీ పాలనలో ఏపీకి చేసిందేమి లేదన్నారు. జీఎస్టీ రూపంలో రూ.8 వేల కోట్లు అనవసరంగా వసూలు చేస్తున్నారని, గతంలో విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు నేడు జీఎస్టీ తగ్గించామని ఉత్సవాలు చేసుకోవడం దుర్మార్గమన్నారు. రాయలసీమకు ఒక్కసాగునీటి ప్రాజెక్టు ఇవ్వకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 11 ఏళ్ల నుండి జీఎస్టీ భారం మోపి ప్రజలను ఇబ్బందుల గురిచేసిన వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇస్తారా అని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారా లేదా, విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణను అడ్డుకుంటారా లేదా అన్న విషయం తెలియచేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం ఏమి చేయకుండా సంబరాలు చేసుకోవడాన్ని వామపక్షపార్టీలుగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 15న జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావులు హాజరౌతున్నారని తెలిపారు. ఈ ర్యాలిని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

11న జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

విశాలాంధ్ర – కర్నూలు : జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలను ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి అబు బాకర్, సీఈఓ వి.సునీల్ కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆసక్తిగల స్కేటింగ్ క్రీడాకారులు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆర్ఎస్ఎఫ్ఐ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు స్థానిక బి.క్యాంపు సమీపంలోని ఖాన ఖజానా రోడ్డులో రేసులను, మాంటి ఇంటర్నేషనల్ స్కూల్లో రింకు రేసులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కేటింగ్ క్రీడాకారులు క్వాడ్, ఇన్‌లైన్ క్రీడాంశంలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఖానాఖజానా రోడ్డులో శనివారం రోడ్ రేసులతో ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఈ పోటీలు ఆరేళ్ల చిన్నారుల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు, సబ్ జూనియర్ సీనియర్ మెన్ అండ్ విమెన్ విభాగంలో పోటీ ఉంటుందన్నారు.

ఆయకట్టు రైతులకు సక్రమంగా నీరు అందిస్తాం

విశాలాంధ్ర – హొళగుంద: తుంగభద్ర ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు రైతులకు సక్రమంగా నీరు అందిస్తామని తుంగభద్ర ప్రాజెక్ట్ డీఈ ఎండీ షావల్లు అన్నారు. ఎల్ఎల్సీ కాలువపై పర్యటించి డీపీ 56, 57లను ఏఈ ఈశ్వర్, సిబ్బంది ద్వారా గురువారం పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురిసినందున రబీ పంటలు కళకళలాడుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి సాగునీటి కొరత లేకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండి రబీ పంటలకు నీరు విడుదల చేస్తున్నామన్నారు. నీటి వృధా కాకుండా ప్రజలు సహకరించాలని కోరారు. తుంగభద్ర ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ఎం.రంకిణ శివప్రసాద్ ఆధ్వర్యంలో డీపీలు, కంట్రోలింగ్ పాయింట్, డీపీల సైడ్ వాల్ నిర్మించడం వల్ల నీరు వృధా కాకుండా నేరుగా పంట పొలాలకు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారన్నారు.

మాటలపై కాదు, అభివృద్ధిపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర –ఆదోని : ఏ కార్యక్రమంలోనైనా వైసీపీ నాయకులను, మాజీ ఎమ్మెల్యేను రావణాసురుడు అంటూ విమర్శిస్తూ పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి కుంభకర్ణుడా అంటూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామవరం మహేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు చంద్రబాబు మాత్రమే తెలుసు, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి జగన్ మాత్రమే తెలుసు తనకు మోడీ, అమిత్ షా, నితిన్ గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్ దేశ నాయకులతో మంచి అనుబంధం ఉందని, ఆదోనిని అభివృద్ధి చేసి చూపుతానని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన తర్వాత అభివృద్ధిని పక్కనపెట్టి ఎమ్మెల్యే మాటలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చంద్రబాబుకి, జగన్మోహన్ రెడ్డికి తెలిసిన నాయకులు చేసిన అభివృద్ధితోనే ఆదోని అభివృద్ధి చెందిందే తప్పా అధికారంలో వచ్చిన వ్వటి నుండి నేటి వరకు నియోజకవర్గంలో ఎక్కడా కూడా అభివృద్ధి జరగ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండేళ్ల కాలం అవుతున్నప్పటికీ ఎమ్మెల్యే చిలక జోస్యాలతో, మాటలతో కాలం వెళ్లదీస్తు వైకాపా నాయకులను విమర్శించడమే పనిగా పెట్టుకొని ఆదోని డెవలప్మెంట్ కోసం అడిగితే ప్రజలను డైవర్ట్ చేస్తూ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశ రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్న మీరు ఆదోని మినీ ఢిల్లీగా అభివృద్ధి చేస్తారని ప్రజలు ఓట్లు వేస్తే అభివృద్ధి మరిచి కుంభకర్ణుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. గత మాజీ ఎమ్మెల్యేల హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, మీరు ఆదోనికి చేసిన అభివృద్ధి ఏది లేదని, ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడుకుందామని చెప్పి నేటికి కూడా రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని పట్టించుకోకపోవడం ప్రజలు గమనిస్తున్నారని తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజలు మీపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆదోనిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఘనంగా చేగువేర 58వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : విప్లవ ధ్రువతార చేగువేరా విద్యార్థి, యువతకు ఆదర్శప్రాయుడని నాయకులు కొనియాడారు. గురువారం చేగువేర 58వ వర్ధంతి సందర్భంగా సీఆర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, నక్కి లెనిన్‌బాబు, ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు రాధాకృష్ణ, రాముడు, రాజశేఖర్, నారాయణ, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, క్రిష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చేగువేర చేసిన పోరాటాలను వారు కొనియాడారు.

ప్రజల జీవన సౌలభ్యం కొరకే జీఎస్టీ 2.0

విశాలాంధ్ర – కర్నూలు వైద్యులు : కర్నూలు మెడికల్ కళాశాలలో జీఎస్టీ 2.0 గురించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ దేశంలోని ప్రజల జీవన సౌలభ్యం కొరకే పరిపుష్టి కొరకే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ఆర్థిక పరిపుష్టికి వ్యాపార సంస్థల వ్యాపార అభివృద్ధికి నూతన సంస్కరణని ఏదే కేంద్ర ప్రభుత్వం, దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రజలందరి సౌలభ్యం కొరకు నాయపరమైన వృద్ధి ఆధారిత జీఎస్టీ ఫ్రేమ్ వర్క్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఆయన తెలిపారు. జీఎస్టీ 2.0 విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, డా.మహేశ్వర్ రెడ్డి, డా.సోమ శేఖర్ పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ గురువారం నాడు కర్నూలు న్యాయ సేవా సదన్ నందు ఎన్జీఓలకు స్టేక్ హోల్డర్లకు శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ప్రజలకు ప్రజలకు అందించే 10 సేవలపై వారికి అవగాహన కలిగించారు. శాశ్వత లోక్ అదాలత్‌తో ప్రజలకు జరిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ సంవత్సరం శాశ్వత లోక్ అదాలత్‌లో 121 కేసులు ఫైల్ కాగా, అందులో 56 కేసులు విజయవంతంగా పరిష్కరించామని తెలిపారు.

మతోన్మాద న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర – ఆదోని క్రైం: సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని డీహెచ్‌పీఎస్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండించాయి. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సభ్యుడు విజయకుమార్ అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదర్శన్, డీహెచ్‌పీఎస్ పట్టణ కార్యదర్శి కుమారస్వామి, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అంజిత్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి హాజరై మాట్లాడారు. జస్టిస్ గవాయ్‌పై సనాతన ధర్మం పేరుతో న్యాయవాది కోర్టులో దాడి చేయడాన్ని దుర్మార్గమని మండిపడ్డారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలను తీవ్రంగా నిరసించారు. జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన కిషోర్‌ను తక్షణమే శిక్షించాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మతోన్మాద చర్యలకు చరమగీతం పాడాలని సనాతన పేరుతో దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షులు వంశీ, భాస్కర్, శ్రీరాములు, వెంకటేష్, కొత్తూరు, ఈరన్న మోహన్ గోపాల్, ఉరుకుందు, పాల్గొన్నారు.

చిన్నారి కలలు, తండ్రి ఆశలు.. కలగలిపి లారీ చక్రాల కింద

- పాఠశాలకు వెళ్లేందుకు పోతూ తిరిగిరాని అనంతలోకాలకు..
- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు దుర్మరణం

విశాలాంధ్ర – ఆస్పరి: దసరా పండుగ ముగిసింది. పాఠశాలలు తెరుచుకున్నాయి. పండుగ వేడుకల్లో తల్లి దండ్రులతో ఆనందంగా గడిపిన చిన్నారి తిరిగి పాఠశాల వెళ్లడానికి సిద్ధమయ్యాడు కానీ, విధి వేరే తీర్పు రాసింది. తండ్రి, కుమారుడు కలిసి ఒకే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం కుటుంబాన్ని, ఆ గ్రామాన్ని శోక సంద్రంలో ముంచింది. వివరాల మేరకు.. క్రిష్ణగిరి మండలం పోతుకుంట్ల గ్రామానికి చెందిన దాసరి మహేష్ (45) వ్యవసాయ కూలీ. జీవనోపాధి కోసం నిత్యం శ్రమించే సాధారణ రైతు కూలీ. ఆయనకు భార్య రామేశ్వరి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఏకైక బిడ్డ శ్రీనివాసులు (14) ఆలూరు మండలం అరికెర అంబేద్కర్ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల్లో స్వగ్రామానికి వచ్చిన శ్రీనివాసులు తల్లిదండ్రులు, అక్కలతో సంతోషంగా గడిపాడు. గురువారం ఉదయం పాఠశాలకు తిరిగి వెళ్లేందుకు తండ్రితో కలిసి ద్విచక్ర వాహనం మీద బయలుదేరారు. కానీ ఆస్పరి మండలంలోని బిల్లే కల్లు కూరగాయల మార్కెట్ దగ్గర బళ్లారి వైపు నుండి వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టడంతో విషాదం చోటు చేసుకుంది. శ్రీనివాసులు (14) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన తండ్రి మహేష్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కుమారుడు చదువుకోవాలన్న కలతో, తండ్రి అతన్ని సురక్షితంగా పాఠశాలకు చేర్చాలనుకున్నాడు. కానీ ఆ ప్రయాణమే చివరిగా మారింది. హాస్టల్‌కి ఆ చిన్నారి బ్యాగ్, పుస్తకాలు, యూనిఫాం, ట్రంకు పెట్టె మాత్రం తన రాకకోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. మృతి వార్త విన్న గ్రామ మంతా కన్నీరు మున్నీరయ్యారు. కొడుకు మృత దేహంతో తల్లి రామేశ్వరి విలపిస్తుండగా బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జీఎస్టీ 2.0 అవగాహన సదస్సు

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈరోజు జీఎస్టీ 2.0 అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన జీఎస్టీ పన్ను తగ్గింపుతో సమాజానికి, వివిధ సంస్థలకు, చిన్న వ్యాపార సంస్థలకు కలిగే లాభాలను వివరించారు. విద్యార్థినులు భవిష్యత్తులో పన్ను వ్యవస్థ, అకౌంటింగ్, వ్యాపార రంగాల్లో పొందగల అవకాశాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.రంగారెడ్డి మాట్లాడుతూ జీఎస్టీకి సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్, ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.నికిత, కీర్తి కుమారి, డాక్టర్ ఎం.సి.సాహిత్య, డాక్టర్ వై.నూర్‌బాష, విజయలక్ష్మి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర – కర్నూలు : నగరంలో పేదలకు రెండు సెంట్లు ఇండ్లస్థలం ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సీ మహేష్ డిమాండ్ చేశారు. గురువారం ఇంటి స్థలాల సాధన సమితి ఆధ్వర్యంలో 98 సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకార్యక్రమానికి పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు నాగరాజు అధ్యక్షత జరిగింది. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రతి పేదవానికి నగరంలో రెండు సెంట్లు, స్థలం, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు నివాసస్థలం ఇస్తానని హామీ అమలు చేయాలన్నారు. నివాసస్థలంతో పాటు ఇంటినిర్మాణం కొరకు రూపాయలు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఇంటిస్థలాల సాధన సమితి కన్వీనర్ రబియా, బాష, ఏసన్న, బి.రాముడు, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం

విశాలాంధ్ర – చిప్పగిరి: అరుదైన బ్రహ్మ కమలం మండల కేంద్రంలో వికసించడంతో గ్రామ ప్రజలు ఎంతో ఆసక్తితో బ్రహ్మ కమలాన్ని చూడడానికి తరలి వచ్చారు. గురువారం గృహ నిర్మాణ శాఖ మండల హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్ నివాస పెరటిలో పెంచిన బ్రహ్మ కమలం గత రాత్రి వికసించడంతో గురువారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఆసక్తిగా తిలకించారు.

రోడ్డు అధ్వాన్నం... ప్రయాణం నరకం

విశాలాంధ్ర – హొళగుంద: కోగిలతోట నుండి బల్లూరు వరకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని, కొత్త రోడ్డు నిర్మించాలని ప్రజలు అధికారులను గురువారం విజ్ఞప్తి చేశారు. బ్రిటీష్ కాలం నాటి రోడ్డును ఎవరు పట్టించుకోకపోవడంతో వర్షానికి గుంతలేర్పడి వాహనాల రాకపోకలకు కష్టంగా ఉందని ప్రజలు వాపోయారు. కోగిలతోటతో పాటు ఇతర గ్రామాల ప్రజలు గుళ్యం గాదిలింగప్ప తాత దర్శనానికి అధిక సంఖ్యలో వెళతారన్నారు. రోడ్డు గుంతల మయంగా, రాళ్లు తేలి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆందోళన చెందారు. పంట పొలాలకు రోడ్డుమీద నరుకు తీసుకురావాలన్నా, ఎరువు ఇతర వస్తువులు ఎద్దుల బండ్లు, ఆటోలు, లారీలు తరలించాలన్నా కష్టంగా ఉన్నదని రైతులు కేశవ వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శేషప్ప, ఎల్లప్పలు వాపోయారు. అధ్వానంగా ఉన్న రోడ్డు మీద వాహనాలను అతి కష్టం మీద డబుకొని బళ్ళారి, హాళకొప్ప, అనంతపురం, గుంతకల్ తదితర ప్రాంతాలకు తిరుగుతున్నామని అన్నారు. రోడ్డు ఇరువైపులా కంప చెట్లు విపరీతంగా పెరిగాయని వీటి వల్ల రోడ్డుపై తిరగాలన్న ఇబ్బంది ఏర్పడిందని విమర్శించారు. పోటు రాళ్లు తేలడం వల్ల వాహనాల టైర్లు పంచరవుతున్నాయన్నారు. అధికారులు కొత్త రోడ్డు నుండి నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులు వాటిల్లవని స్పష్టం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా కొత్త రోడ్డు వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

క్రీడా నైపుణ్యాలను అలవరచుకోవాలి

విశాలాంధ్ర – కోడుమూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడా నైపుణ్యాలను అలవరచుకోవాలని జీబీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.రామచంద్రుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండర్–17, అండర్–14 క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని స్థానిక జీబీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో పాఠశాల హెచ్ఎం జె.రామచంద్రుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాఠశాల స్థల దాత వంశస్థులు గుంతకంటి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతి వెలిగించి,రిబ్బన్ కట్ చేసి బాలుర విభాగానికి సంబంధించిన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే పోటీలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ తోపాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం బాలికల విభాగానికి చెందిన అండర్–17, అండర్–14 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి సురేంద్ర నాయుడు, అమడగుంట రఫీక్, వర్క్షురు రసూల్, గోరంట్ల చంద్రిక రాజు, హరికృష్ణ, పాల్గొన్నారు.

జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన : జిల్లా కలెక్టర్ ఎ.సిరి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: అధికారులందరూ సమన్వయంతో పని చేసి జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా నన్నూరు టోల్ ప్లేజ్ సమీపంలోని రాగ మయూరి వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో పర్యటన ఏర్పాట్లకు సంబంధించిన పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్ కి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ అండ్ బీ ఎస్ఈ తో ఆరా తీశారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ స్పందిస్తూ ప్రధాన మంత్రి కొరకు మూడు హెలిప్యాడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, గ్రావెల్ వేశామని, మెటల్ లేయర్, బీటీ లేయర్ వేయాల్సి ఉందన్నారు. దీనిని వేగవంతంగా పూర్తి చేస్తామని ఆర్ అండ్ బీ ఎస్ఈ కలెక్టర్ కి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కొరకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని ఎస్ఈ తెలిపారు. 11 పార్కింగ్ ప్రదేశాల్లో మొక్కలు తొలగించే పనులు, లెవెలింగ్ పనులు పూర్తి చేశారని, ఇంటర్నల్ రోడ్స్ 11న నాటికి పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ పార్కింగ్ ఇంచార్జిలుగా ఉన్న ఇరిగేషన్ ఎస్ఈ, పంచాయతీ రాజ్ ఎస్ఈ, హౌసింగ్ పీడీ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈలను ఆదేశించారు. 12 లోపు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏమైనా ఉంటే తెప్పించుకోవాలని, 14న రిహార్సల్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. 16వ తేదీన ప్రతి పార్కింగ్ ప్రదేశంలో 3 ట్రాక్టర్లను పెట్టి నీళ్ళ ప్యాకెట్లు ప్రకారం శానిటేషన్ సిబ్బందిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీపీఓను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది యూనిఫాం వేసుకునే విధంగా చూసుకోవాలన్నారు. రోడ్డుపై ఉన్న డివైడర్ల దగ్గర ప్లాంటేషన్ పనులు చేయించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బస్సులో ప్రజలకు భోజనాలు అందించడంతో పాటు తాగునీరు బాటిళ్లను ప్రజలకు అందచేయాలని కలెక్టర్ డీఎస్ఓను ఆదేశించారు. నన్నూరు టోల్ ప్లాజా దగ్గర నుండి 8 అప్రోచ్ రోడ్ల దగ్గర పాయింట్లు ఏర్పాటు చేసుకొని ప్రజలకు మజ్జిగ, తాగు నీరు అందించాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో రెండు అంబులెన్స్‌లు, మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్యాలరీలలో ఎంబీబీఎస్ డాక్టర్‌తో పాటు పారా మెడికల్ స్టాఫ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 12న నాటికి 20 బెడ్, 10 బెడెడ్ ఆసుపత్రులను సిద్ధం చేయాలని కలెక్టర్ మన్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ డాక్టర్లు, స్పెషలిస్ట్ డాక్టర్‌లను, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ స్టేజికి కుడి వైపున ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. 16న అవసరమైన ఫైర్ ఇంజన్ వాహనాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. ప్రస్తుతానికి ఒక మినీ ఫైర్ ఇంజన్ వాహనాన్ని నన్నూరు టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేయాలని కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. హెలిప్యాడ్, సభ ప్రాంగణం, గ్రీన్ రూమ్, లైవ్ కవరేజీకి అవసరమైన నెట్ కనెక్షన్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు. మెడికల్ క్యాంప్, తాత్కాలిక ఆసుపత్రుల్లో విద్యుత్ సౌకర్యం, అన్ని పార్కింగ్ ప్రదేశాల్లో లైటింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. రవాణాకి సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని, కాన్వాయ్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ డీటీసీని ఆదేశించారు. యూనియన్ మినిస్టర్‌లు 6 మంది వచ్చే అవకాశం ఉందని, అందుకే స్పేర్‌గా కాన్వాయ్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ డిటీసిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఏపీఐఐసీ మంతెన రామరాజు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్ర రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

దేశ ప్రజలు రాహుల్ గాంధీని కోరుకుంటున్నారు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ గణేష్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ దేశంలో 11 ఏళ్లుగా బీజేపీ పాలనలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందని, దేశ ప్రజలు జీఎస్టీ పన్నుల భారంతో విసిగిపోయారని విమర్శించారు. ప్రధాని మోదీ బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు జీఎస్టీ తగ్గించామని తాయిలాలు వేస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు నమ్మరని తెలిపారు. జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, బీజేపీ చేస్తున్న దొంగ ఓట్ల కుట్రలను బయటపెట్టారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే, ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి మద్దతుగా ఓట్ల దొంగ మోదీ గద్దె దిగు అను నినాదంతో సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. అనంతరం సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మార్కెట్ ప్రాంతంలో రాహుల్ గాంధీకి మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నంద్యాల డీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ మెంబర్ కర్నూలు జిల్లా ఇంచార్జీ జె.లక్ష్మీనరసింహ యాదవ్, మాజీమంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం.సుధాకర్ బాబు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఎం నాగ మధు యాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షులు కె.బాబురావు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు, ఆయా విభాగాల జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గం నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ.. గో బ్యాక్

ఈ నెల 15న భారీ నిరసన, ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హెూదా ఇస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని చెప్పి మాట తప్పిన మోడీకి కర్నూలులో పర్యటించే హక్కులేదని, 16న కర్నూలులో మోడీ పర్యటను నిరసిస్తూ 15న మోడీ గోబ్యాక్ అంటు నిరసన ర్యాలీ జయప్రదం చేయాలని వామ పక్షపార్టీల నేతలు పిలువు నిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, నక్కి లెనిన్‌బాబు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, సీపీఎం నాయకులు రాధాకృష్ణ, రాముడు, రాజశేఖర్, నారాయణ, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, క్రిష్ణలతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.గిడ్డయ్య, గౌస్‌దేశాయ్, నాగన్నలు మాట్లాడుతూ 11 సం మోడీ పాలనలో ఏపీకి చేసిందేమి లేదన్నారు. జీఎస్టీ రూపంలో రూ.8 వేల కోట్లు అనవసరంగా వసూలు చేస్తున్నారని, గతంలో విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు నేడు జీఎస్టీ తగ్గించాడని ఉత్సవాలు చేసుకోవడం దుర్మార్గమన్నారు. రాయలసీమకు ఒక్కసాగునీటి ప్రాజెక్టు ఇవ్వకుండా, ప్రత్యేక హెూదా ఇవ్వకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 11 ఏళ్ల నుండి జీఎస్టీ బారం మోపి ప్రజలను ఇబ్బందుల గురిచేసిన వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇస్తారా అని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారా లేదా, విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణను అడ్డుకుంటారా లేదా అన్న విషయం తెలియచేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం ఏమి చేయకుండా సంబరాలు చేసుకోవడంను వామపక్షపార్టీలుగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 15న జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు బారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావులు హాజరైతున్నారని తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

బోధనేతర పనులు బహిష్కరిస్తాం

విశాలాంధ్రు- హెూళగుంద: ఫ్యాప్టో ఆధ్వర్యంలో నేటి నుండి బోధ నేతర పనులు, విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరించుటకు మండల ఉపాధ్యాయులు ఎంఈఓ కబీర్‌కు గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, ఫ్యాప్టో కార్యాచరణలో భాగంగా మెమోరాండం ఇవ్వడం జరిగిందని, బోధనేతర కార్యక్రమాలు, ఉపాధ్యాయులను బోధన నుండి దూరం చేస్తున్నాయని సీనియర్ నాయకులు ఎస్.పోతరాజు, జి.దొడ్డ బసప్ప తెలిపారు. బోధ నేతర పనులు బహిష్కరించుటకు మండల ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకము, సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర బోధ నేతర పనులు మరియు అనవసరమైన గూగుల్ షీట్స్, విద్యాశక్తి, జీఎస్టీ 2.0, సీజనల్ ప్రచార కార్యక్రమాలు, ఉపాధ్యాయుల ఆటల పోటీలు, నిర్వహించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు లాలు స్వామి, డి.పాండురంగ, మౌలాలి, వై.వెంకటేష్, ప్రభాకర్,ఎం.ధనుంజయ, ఎస్.ఈరన్న, బి.టి.ఖలందర్, జె.శేఖర్‌అప్ప, బి.గాదిలింగప్ప, కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంబంధించిన కర పత్రాలతో ప్రజలకు, చిన్న వ్యాపారులకు, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం టిడిపి గ్రామ అధ్యక్షులు వీరేష్ గౌడ్, సొసైటీ అధ్యక్షులు కందనాతి నరసప్ప మాట్లాడుతూ జీఎస్టీ రేట్లు తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. రైతులకు అవసరమైన పని ముట్ల ధరలు తగ్గుతాయన్నారు. దీంతో ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రజలకు పొదుపు, ఆదాయం పెరిగి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు చాకలి నారాయణ, ఉపాధ్యక్షులు చంద్ర, నాయకులు హనుమంతు, నర్సింహులు సచివాలయ సిబ్బంది, ఏఎనం సావిత్రి, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామానికి చెందిన బాధితులకు గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి అందజేశారు. గ్రామానికి చెందిన డోలు రామాంజనేయులుకు రూ.61,500, కోసిగి ఈరమ్మకు రూ.25 వేల చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంజీ నరసన్న, ప్రధాన కార్యదర్శి మొత్రు రామాంజనేయులు, బీసీ సెల్ మండల నాయకులు తలారి అంజి, కోసిగి మార్కెట్ యార్డు డైరెక్టర్ కలుగొట్ల లక్ష్మన్న, నాయకులు గౌళ్ల నల్లారెడ్డి, కోడిగుడ్ల లక్ష్మన్న, కంపాడు లక్ష్మన్న, జనసేన నాయకులు మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

పీఎం పర్యటనను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - వెలుగోడు: ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి జిల్లా ఉపాధ్యక్షుడు దూపాటి మురళీధర చౌదరి అన్నారు. పట్టణంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోతుల రాజా శేఖర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో దూపాటి మురళీధర చౌదరి మాట్లాడుతూ ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొదటి సారి శ్రీశైలంలో జ్యోతిర్లింగ, శక్తిపీఠ క్షేత్రాల దర్శనం చేసుకుని అక్కడి నుండి అనంతరం ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని ,ఎన్‌డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలోని నాయకులు కార్యకర్తలు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభిమానులు విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేష్, బిజెపి నాయకులు వడ్ల ప్రతాప్ ఆచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నూలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాటలపై కాదు, అభివృద్ధిపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర -ఆదోని : ఏ కార్యక్రమంలోనైనా వైసీపీ నాయకులను, మాజీ ఎమ్మెల్యేను రావణాసురుడు అంటూ విమర్శిస్తూ పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి కుంభకర్ణుడా అంటూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామవరం మహేంద్రనాథ్ రెడ్డి విమర్శిం చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు చంద్రబాబు మాత్రమే తెలుసు, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి జగన్ మాత్రమే తెలుసు తనకు మోడీ, అమిత్ షా, నితిన్ గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్ దేశ నాయకులతో మంచి అనుబంధం ఉందని, ఆదోనిని అభివృద్ధి చేసి చూపుతానని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన తర్వాత అభివృద్ధిని పక్కనపెట్టి ఎమ్మెల్యే మాటలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చంద్రబాబుకి, జగన్మోహన్ రెడ్డికి తెలిసిన నాయకులు చేసిన అభివృద్ధితోనే ఆదోని అభివృద్ధి చెందిందే తప్పా అధికారంలో వచ్చినప్పటి నుండి నేటి వరకు నియోజకవర్గంలో ఎక్కడా కూడా అభివృద్ధి జరగ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండేళ్ల కాలం అవుతున్నప్పటికీ ఎమ్మెల్యే చిలక జోస్యాలతో, మాటలతో కాలం వెళ్లదీస్తు వైకాపా నాయకులను విమర్శించడమే పనిగా కట్టుకొని ఆదోని డెవలప్మెంట్ కోసం అడిగితే ప్రజలను డైవర్ట్ చేస్తూ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశ రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్న మీరు ఆదోనిని మినీ ఢిల్లీగా అభివృద్ధి చేస్తారని ప్రజలు ఓట్లు వేస్తే అభివృద్ధిని మరిచి కుంభకర్ణుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. గత మాజీ ఎమ్మెల్యేల హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, మీరు ఆదోనికి చేసిన అభివృద్ధి ఏది లేదని, ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడతామని చెప్పి నేటికి కూడా రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని పట్టించుకోకపోవడం ప్రజలు గమనిస్తున్నారని తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజలు మీపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆదోనిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నాను.

ప్లాస్టిక్ వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలో గ్రామ పంచాయతీ ఈవో బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ వ్యతిరేకంగా గ్రామపంచాయతీ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం నాడు పట్టణంలో పలు దుకాణాల నందు గ్రామపంచాయతీ సిబ్బంది ప్లాస్టిక్ నిషేధిద్దాం షాపింగ్ కోసం సొంత సంచిని వాడుదాం అంటూ బ్యానర్ పట్టుకొని పలు దుకాణాలు వద్ద ప్రచారం చేశారు.

బోధనేతర పనులను బహిస్కరిస్తున్నాం

విశాలాంధ్ర - ఆలూరు : రాష్ట్ర పిలుపుమేరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి కొమలాదేవికి వినతిపత్రం ఇస్తూ గురువారం ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ, మండలంలో శుక్రవారం నుంచి ఫ్యాప్టో ఆధ్వర్యంలో బోధనకు ఆటంకం కలిగించే బోధనేతర పనులను బహిస్కరిస్తున్నాం అని వారి తెలియజేశారు. కేవలం విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకంకు సంబంధించిన పనులు మాత్రమే చేపడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి బంటనహాల్ నాగరాజులి మండల బాధ్యులు నేమకల్ నాగరాజు, సూర్యనారాయణ, ఇతర ఉపాధ్యాయ సంఘ నాయకులు కాశీం, సురేష్ బాబు, రంగస్వామి, సుధా శేఖర్, తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతోన్మాద న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - ఆదోని క్రైం: సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని డీహెచ్‌పీఎస్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండించాయి. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సభ్యుడు విజయకుమార్ అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదర్శన్, డీహెచ్‌పీఎస్ పట్టణ కార్యదర్శి కుమారస్వామి, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అంజిత్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి హాజరై మాట్లాడారు. జస్టిస్ గవాయ్‌పై సనాతన ధర్మం పేరుతో న్యాయవాది కోర్టులో దాడి చేయడాని దుర్మార్గమని మండిపడ్డారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలను తీవ్రంగా నిరసించారు. జస్టిస్ గవాయిపై దాడి చేసిన కిషోర్‌ను తక్షణమే శిక్షించాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మతోన్మాద చర్యలకు చరమగీతం పాడాలని సనాతన పేరుతో దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షులు వంశీ, భాస్కర్, శ్రీరాములు, వెంకటేష్, కొత్తూరు, ఈరన్న మోహన్ గోపాల్, ఉరుకుందు, పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను అలవరచుకోవాలి

విశాలాంధ్ర - కోడుమూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడా నైపుణ్యాలను అలవరచుకోవాలని జీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.రామచంద్రుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండర్-17, అండర్-14 క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని స్థానిక జీవిఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో పాఠశాల హెచ్ఎం జె.రామచంద్రుడు ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమా నికి పాఠశాల స్థల దాత వంశస్థులు గుంతకంటి కృష్ణారెడ్డి ముఖ్య అతిథి గా హాజరై క్రీడా జ్యోతి వెలిగించి,రిబ్బన్ కట్ చేసి బాలుర విభాగానికి సంబంధించిన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే పోటీలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ తోపాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం బాలికల విభాగానికి చెందిన అండర్-17, అండర్-14 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మిం టన్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించ నున్నట్లు చెప్పారు. కార్య క్రమానికి మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి సురేంద్ర నాయుడు, అమడగుంట్ల రఫీక్, వర్కురు రసూల్, గోరంట్ల చంద్రిక రాజు, హరికృష్ణ, పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డి మృతికి కళారాధన నివాళి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సిటీకేబుల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలు అందించిన నరాల జయ చంద్రారెడ్డి బుధవారం హైదరాబాదులో మృతికి కళారాధన నంద్యాల సాంస్కృతిక సంస్థ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోంది. కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ నంద్యాల సిటీ కేబుల్‌కు అనేక ఏళ్లు మేనేజింగ్ డైరెక్టర్‌గా జయచంద్రారెడ్డి నంద్యాల పట్టణంలో కేబుల్ టీవీ ప్రసారాలు విస్తృత కావడంలో విశేషంగా సేవలు అందించారని గుర్తు చేశారు. దసరా శక్తి వేషాలను నంద్యాలలో పునరుద్ధరించి అనేక సంవత్సరాలు నిర్వహిం చారని, ఇటీవల దసరాకు ముందు హైదరాబాదులో అనారోగ్యంతో ఉన్న సమయంలో కూడా దసరా శక్తి వేషాల పోటీల గురించి ఆసక్తి కనపరిచారని తెలిపారు.

ప్రధాని బహిరంగ సభకు మెప్మా సభ్యులు తరలిరావాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 16న నంద్యాల రోడ్డులోని రాగమయూరి గ్రౌండ్స్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి తీసుకోవలసిన ఏర్పాట్లపై, మెప్మా ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ బహిరంగ సభకు మెప్మా గ్రూప్ మహిళలను విస్తృతంగా సమీకరించాలని ఆర్‌పీలను ఆదేశించారు. ప్రతి సమాఖ్య నుండి కనీసం 150 మంది సభ్యులను సమీకరించాలని సూచించారు. ఇందుకోసం ప్రతి సమాఖ్యకు 3 బస్సులు కేటాయించగా, ప్రతి బస్సులో ఒక ఆర్పీ, ఒక జీఎస్‌డబ్ల్యూ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల కోసం అవసరమైన ఆహారం, తాగునీరు తదితర అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు తెలిపారు. ప్రతి ఆర్పీ తమ పరిధిలోని గ్రూపులలో రోజుకు 10 గ్రూపుల చొప్పున సమావేశాలు ఏర్పాటు చేసి, కార్యక్రమ వివరాలు తెలిపి, సభకు అందరూ హాజరయ్యేలా కృషి చేయాలని సూచించారు. సభలో పాల్గొనేందుకు మహిళలకు అవసరమైన ఏర్పాట్లు సమయానుసారం పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్ మురళి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, టీఎంసీలు సుధాకర్, భారతి, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు వివరాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జీఎస్టీ తగ్గింపు వివరాలు ప్రతి ఒక్కరు తెలుసుకోవడం ద్వారా కొనుగోళ్లలో రేటు వ్యత్యాసం మనకు కలిసి వస్తుందని క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగ రాజ్ శెట్టి అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలో జీఎస్టీ తగ్గింపుపై నాల్గవ రోజు అవగాహన కార్యక్రమాల సందర్భంగా డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులు జీఎస్టీ తగ్గింపు వివరాలను పూర్తిగా తెలుసుకుని ఎవరి పరిధిలో వారు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించినప్పుడు వాటిని పాజిటివ్‌గా తీసుకొని ముందుకు సాగాలన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులు అంటే ఐక్యతకు మారుపేరుగా నిలవాలన్నారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ అక్తర్ భాను మాట్లాడుతూ విద్యార్థులు చైతన్యవంతులు అయితే జీఎస్టి తగ్గింపు వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కష్టమేమి కాదన్నారు. యూనివర్సిటీ స్థాయిలో పోస్టర్ ప్రజెంటేషన్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. డీన్ అడ్మిషన్స్ మహమ్మద్ వాహిజ్ మాట్లాడుతూ జీఎస్టి తగ్గింపుపై ఎంత అవగాహన కల్పిస్తే అంత ఉపయోగం ఉంటుందన్నారు. ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్‌ల మీద జీరో జీఎస్టీ అన్న విషయాన్ని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ దలవాయి శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మణ్ గుప్తా, డాక్టర్ మల్లయ్య, పి.కీర్తి కుమారి, డాక్టర్ అనూష, డాక్టర్ స్వప్నశ్రీ, డాక్టర్ దివాకర్‌లు పాల్గొన్నారు.

సర్వజన వైద్యశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు మందులు, వైద్య పరికరాలపై తగ్గిన ఆంధ్రప్రదేశ్ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిన్న ఉదయం ఆసుపత్రి అడిషనల్ డీఎంఈ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ, ధన్వంతరి కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ఇంచార్జి ఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆసుపత్రి ఇంచార్జీ సీఎస్ ఆర్ఎంఓ డా.వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు, తక్కువ జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది అని తెలిపారు.వైద్య అవసరాలకు ఉపయోగించే ఆక్సిజన్ ధర సర్జికల్ పరికరాలు, డయాగ్నొస్టిక్ టూల్స్, ఆర్థోపెడిక్ పరికరాలు వంటి వాటిపై పన్ను తగ్గడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ తగ్గడంతో రోగులకు వైద్య ఖర్చులు తగ్గుతాయని అన్నారు. తలవంతరం అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ ద్వారా వైద్య పరికరాలు, ప్రజలకు ధరలు తగ్గుదలతో వైద్య పరికరాలు, రోగ నిర్ధారణ కిట్లపై పన్ను తగ్గించడం వల్ల ఆసుపత్రులు, రోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మందుల ధరలు తగ్గుదలతో అత్యవసర, ప్రాణాధార మందులపై జీఎస్టీని తగ్గించడం వల్ల రోగుల వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డా.పద్మజ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.శివ బాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, మెడికల్ స్టోర్ ఆఫీసర్ డా.శారద, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

స్వంత ఖర్చులతో రోడ్డు మరమ్మతు చేసిన యువ నాయకుడు

విశాలాంధ్ర - హెూళగుంద: హెూళగుంద నుండి హెబ్బూరు కొట్టాల వరకు తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.వెంకట శివ ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.4.50 కోట్లలతో అధికారులు కొత్త రోడ్డుని నిర్మించారు. నిధులు మంజూరు కాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతంగా ఆగిపోయాయి. మార్గమధ్యంలో వర్షానికి గుంతల మయంగా మారింది. మట్టి రోడ్డు బురద గుంటగా, చిత్తడిగా ఉండడంతో వాహనాలు తిరగాలన్న ప్రజలు నడవాలన్న కష్టంగా ఉండడంతో టీడీపీ యువ నాయకుడు మిక్కిలినేని కిరణ్ కుమార్ స్పందించి తుంగభద్ర డి డీసీ చైర్మన్ ఎం.వెంకట శివ ప్రసాద్ ఆదేశాలతో స్వంత ఖర్చులు చేసి రోడ్డుకు ఎర్రమట్టి వేసి ట్రాక్టర్ ద్వారా లెవెల్ చేయడంతో ప్రజల రాకపోకలకు ఎంతో సులభం అయింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు అనుసంధానం చేసే రోడ్డు అహ్వానంగా మారడంతో టీడీపీ యువ నాయకుడు ఎం.కిరణ్ కుమార్ స్పందించి రోడ్డు మరమ్మత్తు చేసినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అర్ధాంతంగా నిలిచిపోయిన రోడ్డును వెంటనే నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మిక్కిలినేని కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎంసుబ్బారావు, ఎం.విజయ భాస్కర్ రావు, ఎం.రమేష్, ఎం.శ్రీనివాసరావు, శాలి మహబూబ్ బాష, కొడాలి వేణుగోపాలరావు, కురవ మల్లికార్జున, విజయ్ పాల్గొన్నారు